నేడే పల్లెపోరు

- తొలి విడత ఎన్నికలకు సర్వం సిద్ధం
- 95 సర్పంచ్, 685 వార్డు స్థానాలకు పోలింగ్
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
- 2 గంటల నుంచి కౌంటింగ్, ఆ వెంటనే ఫలితాల ప్రకటన
- ఉప సర్పంచుల ఎంపిక కూడా..


కాల్వశ్రీరాంపూర్ మండలం డిస్ట్రిబ్యూటర్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది


కమాన్‌పూర్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రంలో కలెక్టర్ పరిశీలన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం గురువారం జరగనున్న అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని సిబ్బంది వెంట తీసుకవెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. మొదటి విడతలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని 99 గ్రామ పంచాయతీలు, 896 వార్డు స్థానాలకు గత నెల 27వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల ఉపసంహ రణ సందర్భంగా మంథని మండలం తోటగోపయ్యపల్లి పంచాయతీ సర్పంచ్ సహ ఆరు వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో ఈ గ్రామంలో పోలింగ్ జరగదు. అలాగే మైదుపల్లి, నాగారం, రామగిరి మండలం చందనాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలు, 211 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 98 గ్రామ పంచాయతీల్లో 685 వార్డు స్థానాలకు, 95 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 95 సర్పంచ్ స్థానాలకు 376 మంది అభ్యర్థులు, 685 వార్డు స్థానాలకు 1880 మంది అభ్యర్థులు హోరాహోరీగా తలపడుతున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 1404 పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఈ విడతలో 305 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌తోపాటు పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. గత వారం రోజుల నుంచి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల మధ్యనే పోటీ జరుగుతున్నది. బీజేపీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు కరువయ్యారు. జనరల్, బీసీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను, కుల సంఘాలను, యువతను, మహిళలను ఆకర్శించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలాగే కొన్ని చోట్ల ఓటర్లను ప్రభావితం చేసేందుకు మద్యం, మాంసంతో విందులు ఏర్పాటు చేశారు. ఓటుకు నోట్లు కూడా ఆయా గ్రామాల్లో పంపిణీ చేసినట్లుగా ప్రచారం జరుగుతున్నది. అభ్యర్థులు ఎన్నికలపై తీవ్రమైన ఉత్కంఠతో ఉన్నారు. గెలుపుపై పైకి ధీమాగానే కనబడుతున్నప్పటికీ, లోలోపల టెన్షన్‌కు గురవుతున్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తర్వాత గెలుపొందిన వార్డు సభ్యులు అంతా కలిసి ఉప సర్పంచ్‌ను ఎన్నుకోనున్నారు.

● మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మంథని	17040	17927	04	34971
ముత్తారం	11328	11868	01	23197
రామగిరి	16167	16406	01	32574
కమాన్‌పూర్	9875	10270	0	20146
కాల్వశ్రీరాంపూర్	17225	17595	01	34822
మొత్తం	71635	74068	7	145710


మంథనిలో డిస్ట్రిబ్యూటరీ కేంద్రం వద్ద డీసీపీతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష


కాల్వశ్రీరాంపూర్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష


పోలింగ్ సామగ్రితో వెళుతున్న సిబ్బంది

నేడే పోలింగ్.. కౌంటింగ్...

● గ్రామాలకు తరలి వెళ్లిన అధికార యంత్రాంగం


డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి తరలివెళ్తున్న సిబ్బంది

మంథని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు గురువారం జరుగుతున్నాయి. తొలి విడత జిల్లాలోని ఐదు మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈసీ షెడ్యూల్ ప్రకారం జిల్లాలో 99 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా మంథని మండలంలోని 3, రామగిరి మండలంలో ఒక గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. గ్రామ పంచాయతీల్లో గెలుపొందిన వారిలో మెజార్టీ వార్డు సభ్యుల మద్దతులో ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను అధికారులు నిర్వహించనున్నారు. మెజార్టీ ఉన్న వార్డు సభ్యుడు ఉప సర్పంచ్‌గా ఎన్నికకానున్నారు. మెజార్టీ గ్రామ పంచాయతీల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచే ఇద్దరి నుంచి మొదలుకొని నలుగురు అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉన్నారు. పార్టీ పరంగా ఒక అభ్యర్థికి మద్దతు ప్రకటించగా మిగితా వారంతా రెబల్‌గా పోటీలో ఉన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం ఐదు మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్‌సెంటర్ నుంచి మధ్యాహ్నం బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్లు, ఇతర సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో అధికార యంత్రాగం తరలివెళ్లారు. సాయంత్రం వరకు అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. వీరికి పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు రక్షణ కల్పించారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలను సైతం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక సదపాయాలు కల్పించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు సర్పంచ్, వార్డు సభ్యుల, ఉప సర్పంచ్ ఎన్నికల ఫలితాలు వెలువడుతుండటంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొననుంది. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.


మంథనిలో పోలింగ్ సామగ్రితో తరలి వెళ్తున్న ఉద్యోగులు

న్యాయవాది విజయం కోసం ఏకమైన గ్రామస్థులు

● పుట్నూర్ సర్పంచ్ అభ్యర్థి బరిలో బాలాజీరావు


గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బాలాజీరావు, (ఇన్‌సెట్‌లో) బాలాజీరావు

పాలకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్ పంచాయతీ ఎన్నికలు ఒక మినీ సంగ్రామంగా జరుగుతున్నాయి. సర్పంచ్ అభ్యర్థి కల్లెపు బాలాజీరావు ఉంగరం గుర్తుతో ప్రచారం రోజురోజుకు చాప కింద నీరులా దూసుకుపోతోందని పలువురు చర్చించుకుంటున్నారు. కుటుంబ సభ్యులతోపాటు గ్రామంలోని యువతను, గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్న క్రియాశీల వ్యక్తులను ప్రచారంలో భాగస్వామ్యం చేస్తున్నారు. గతంలో గ్రామ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించిన వ్యక్తులు సైతం బాలాజీరావుకు మద్దతు ప్రకటించడంతో పాటు ప్రచారంలో పాల్గొని ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా బాలాజీ రావును గెలిపిస్తే గ్రామానికి జరుగబోయే అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. బాలాజీరావు ప్రజలతో మాట్లాడుతూ గ్రామానికి సేవ చేయాలనే దృఢసంకల్పంతో పలు కుల సంఘాల నాయకులు, యువకులు, సామాజిక కార్యకర్తలు బలపర్చడంతో అందరి ఆశీస్సులతో ప్రజల ముందుకు వచ్చానన్నారు. గ్రామ ఓటర్లు ఉంగరం గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొంటూ బాలాజీరావుకు మద్దతుగా నిలుస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ కోయశ్రీహర్ష తెలిపారు. బుధవారం పోలింగ్ కేంద్రాలను, మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాల్వశ్రీరాంపూర్ మండలంలో 24 గ్రామపంచాయతీలకు, 226 వార్డులకు 226 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బందిని, ప్రీసైడింగ్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి కేంద్రంలో ఉదయం 7 గంటలకు పోలింగ్, మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. ఎన్నికల అబ్జర్వర్ నర్సింహరెడ్డి, ఆర్డీఓ గంగయ్య డీసీపీ భూక్యరాంరెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ రాంమోహన్‌చారి, తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు, ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల సిబ్బంది నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయశ్రీహర్ష తెలిపారు. కమాన్‌పూర్ మండలంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాల్లో చెప్పిన విధంగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బందితోపాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి గ్రామపంచాయతీ అధికారులు, కార్యదర్శులు, ఎంపీడీఓలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, తాగునీటి వసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజనవసతి చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.


ముత్తారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, అధికారులు

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సిబ్బంది నిబంధనలు పాటిస్తూ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మొదటి విడతలో పోలింగ్ జరుగనున్న మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని తెలిపారు. ఎన్నికల విధిని నిర్వహించే సిబ్బందికి గ్రామ పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, ఎంపిడిఓలు వసతులు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఏసీపీ రమేష్, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎంపీడీవో సురేష్ తదితరులున్నారు.

మంథని/రామగిరి, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంథని, రామగిరి మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తొలి విడతలో గురువారం జరిగే ఎన్నికల్లో శిక్షణ చెప్పిన విధంగా నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ఎక్కడ అలసత్వం వహించరాదన్నారు. ఎక్కడ వివాదాలు లేకుండా సజావుగా జరిగేలా చూడాలన్నారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ సామగ్రి, ప్రత్యేకంగా బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే వారికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో భోజన, వసతి తోపాటు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఏసీపీ రమేష్, జెడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య సురేష్, ఎంపీడీవోలు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగనున్న పంచాయతీ మొదటి విడుత ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. మొదటి విడుతలో కాల్వ శ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాల్లో 95గ్రామ పంచాయతీలు, 685 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగనున్నది. పెద్దపల్లి జోన్ పరిధిలో గోదావరి వంతెన, ఎగ్లాస్‌పూర్, దుబ్బపల్లి, గుంపులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టామన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంపై ఇద్దరిపై కేసు నమోదు అయ్యిందని, అలాగే 35గన్ లైసెన్స్‌లకుగాను 34ఆయుధాలను డిపాజిట్ చేయించామన్నారు.

మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు కమిషరేట్ పరిధిలో ఇద్దరు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 30మంది సీఐలు, 95మంది ఎస్ఐలు, 275హెడ్ కానిస్టేబుళ్లు, 520మంది కానిస్టేబుళ్లు ఇలా మొత్తం 1600మంది బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్నీ రకాల చర్యలు చేపడుతున్నామని, కంట్రోల్ రూమ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్టు సీపీ చెప్పారు.

టీబీ ఛాంపియన్లకు శిక్షణ ప్రారంభం
● డీఎంహెచ్‌వో వాణిశ్రీ 8

కార్మికులు రక్షణతో పనిచేయాలి
● రక్షణ పక్షోత్సవాల్లో జీఎం 8



మూడో విడత బరిలో 2097 మంది అభ్యర్థులు

6 సర్పంచ్, 215 వార్డు స్థానాలు ఏకగ్రీవం



పెద్దపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 2097 మంది సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ పడుతున్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కాగా, వివరాలను బుధవారం డీపీవో వీర బుచ్చయ్య విడుదల చేశారు. ఈ విడతలో పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లోని 91 పంచాయతీలకు గాను రాంపెల్లి, పిట్టల ఎల్లయ్యపల్లి సర్పంచ్, వార్డు స్థానాలు మొత్తం ఏకగ్రీవం కాగా, సుల్తానాబాద్ మండలం గొల్లప ల్లి, రాముని‌పల్లి, నారాయణరావుపల్లి, ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామాల సర్పంచ్ పదవులు, మొత్తం 852 వార్డు స్థానాలకు 215 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 89 పంచాయతీల్లో వార్డు స్థానాలు, 85 పంచాయతీల్లో వార్డు స్థానాలకు పోలింగ్ జరగనున్నది. సర్పంచ్ పదవి కోసం 300 మంది అభ్యర్థులు, 636 వార్డు స్థానాలకు 1797 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని డీపీవో పేర్కొన్నారు. గుర్తులు కేటాయించడంతో అభ్యర్థులు ప్రచారం పర్వంలోకి దిగారు. ఈ నెల 17వ తేదీన పోలింగ్ జరగనున్నది.

ఎన్నికల సిబ్బందికి మరుసటి రోజు ఓడీ ఇవ్వాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతోపాటు ఇతర సిబ్బందికి కూడా ఓడి సౌకర్యం కల్పించాలని డీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంకిషన్‌రావు, సంతోష్ రెడ్డి కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వరుసగా మూడు దశల ఎన్నికల డ్యూటీని కేటాయించడం నుంచి ఒక దశ మినహాయింపు ఇవ్వాలని, సమాన ప్రతిపాదికన అసలే డ్యూటీలు రాని వారికి డ్యూటీలు కేటాయించాలని వారు కోరారు. అలాగే ఎన్నికలు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మరుసటి రోజు ఓడి సౌకర్యాన్ని కల్పించాలన్నారు.

ఓటు వేయడానికి తప్పక రావాలే..

- వలస ఓటర్లపై పంచాయతీ అభ్యర్థుల నజర్
- పట్టణాల్లో ఉంటున్న వారికి ఫోన్లు
- దూర ప్రాంత ఓటర్లను రప్పించడానికి ప్రయత్నాలు



ముత్తారం, డి సెంబరు 10 (ఆం ధ్రజ్యోతి) : పల్లెల్లో ఎక్కడ చూసినా ఎన్నికల హడా వు డి... రచ్చబండల వద్ద జోరుగా చర్చ జరుగుతోంది. పంచాయతీ సమరంలో ప్రతీ ఓటు కీలకం కావడంతో అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. విజయం తమనే వరించాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి ప్రచారంతో ఒక వైపు గ్రామంలో నివాసం ఉంటున్న ఓటర్లకు గాలం వేస్తున్నారు. పోలింగ్‌కు వచ్చేలా పల్లె నాయకులు, స్థానిక పెద్దలు ఫోన్లు చేస్తూ వలస ఓటర్లను రప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లోని ఓటర్లను దగ్గరుండి పల్లెకు రప్పించేందుకు ప్రత్యేకంగా మనుషులను కేటాయించడంపై దృష్టి సారించారు. అవసరమైతే ఓటుకు రేటు కట్టి మరీ పల్లెకు చేరుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఉపాధి నిమిత్తం పలు పల్లెల యువతీ యువకులు పట్టణాలతో పాటు హైద్రాబాద్, ప్రాంతాలకు వెళ్లిన గ్రామాలకు చెందిన వ్యక్తుల ఓట్లను రాబట్టుకోవ డానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఓటర్లకు వాహనాలు ఏర్పాటు..

గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సందడి జోరందుకుంటోంది, అభ్యర్థుల ఇండ్లలో హడావుడితో పాటు బయట కూడా అదే ఉత్సాహం కనిపిస్తోంది. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉన్న గ్రామ ఓటర్లను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ట్రావెల్స్ బస్సులు, కార్లను ముందస్తుగా బుక్ చేస్తున్నారు. పోలింగ్ రోజున సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లను తీసుకొచ్చే వాహనాలు ఆలస్యం కాకుండా ముందస్తుగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు.

ఫోన్ల ద్వారా సందేశాలు..

పంచాయతీ ఎన్నికల్లో పల్లె ఓటర్లతో పాటు ఉపాధి నిమిత్తం పట్టణాలకు వెళ్లిన ఓటర్లు సైతం కీలకమవుతున్నారు. ఎప్పుడు బయలు దేరుతున్నారు అంటూ అభ్యర్థులు వాకబు చేస్తున్నారు. సోషల్ మీడియాలో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పెండ్లి ఆహ్వాన పత్రాలు పంపినట్లుగా వాట్సాప్ గ్రూపుల్లో ఓటర్లకు తమ అభ్యర్థి తరఫున సందేశాలు పంపి స్తున్నారు. అన్నా పోలింగ్ రోజు తప్పకుండా గ్రామానికి రావాలి మీ అమూ ల్యమైన ఓటు వేయాలి.. అంటూ మెసెజులు వెల్లువెత్తుతున్నాయి. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారు.. ఎక్కడ ఉంటున్నారు... ఎప్పుడు వస్తారు... ఎలాంటి వాహనాలు ఏర్పాటు చేయాలి.. అనే పనిలో అభ్యర్థుల అనుచరులు నిమగ్నమయ్యారు. మరికొందరు అభ్యర్థులు తమ ఓటర్లకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి మద్దతు కోరుతున్నారు. వలసల పెరుగుదలతో ఇప్పుడు గ్రామ రాజకీయాల్లో పట్నం ఓటర్ల ప్రభావం పెరిగింది.

విందులే విందులు..

గ్రామాల్లో ఓటర్లను ఆకర్శించే విధంగా విందు రాజకీయాలకు తెరలేపుతున్నారు. పట్నంలో ఉన్న వలస ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు బరిలో ఉన్న ప్రతీ అభ్యర్థి ఆయా ప్రాంతాల్లో రోజూవారీ వంటకాలు, విందులకు ప్లాన్ చేసుకుంటున్నారు. పట్నం ఓటర్లు ఏఏ ప్రాంతాల్లో ఉన్నారనే లెక్కల మేరకు ఒక్కో ఏరియాకు ఇన్చార్జిలను నియమించి పోలింగ్ తేదీ వరకు ఉండే విధంగా ప్లాన్ చేశారు. ఇన్చార్జిలు రోజు వలస ఓటర్లను కలవడం, పనులు ముగించుకుని ఇంటికి రాగానే విందు ఏర్పాటు కార్యక్ర మాల్లో నిమగ్నమవుతున్నారు.



ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరి మృతి


రాజయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని జాఫర్‌ఖాన్ పేటలో జరిగింది. గ్రామానికి చెందిన చీదురు రాజయ్య(50) ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడం కోసం మండలంలోని ఇదిలాపూర్ గ్రామానికి చెందిన అల్లం రమేష్ ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తున్నాడు. గతనెల 23నఇంటి నిర్మాణానికి మట్టి తరలిస్తుండగా అల్లం రమేష్ కుమారుడు అల్లం శేష్ కుమార్ ట్రాక్టర్ నడుపుతూ చీదురు రాజయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన రాజయ్యను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామానికిచెందిన గోపిడి హన్మక్క(82) అనేవృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగురోజుల క్రితం హన్మక్క గ్రామంలో తనఇంట్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో హన్మక్కకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. హన్మక్క అల్లుడు హన్మంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన కటుకం శరత్ చంద్ర(39) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కరీంనగర్ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న శరత్‌చంద్ర మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా పని చేస్తున్నాడు. దీంతో పాటు బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలతో అప్పులు పెరిగిపోయాయి. హుజూరాబాద్‌లో పని ఉందని మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. స్వగ్రామం చొప్పదండిలోని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు గుర్తించారు. శరత్ చంద్ర భార్య దివ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేరువేరుగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండలంలోని మోర్రాయిపల్లె గ్రామానికి చెందిన అకారం అరుణ్ వద్ద రూ.8వేల విలువ చేసే మద్యం, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన పాతూరి బాల్‌రెడ్డి వద్ద రూ 3వేల విలువచేసే మద్యాన్ని పట్టుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనకాలగల కాలనీలో బొజ్జ శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన మద్యంను బుధవారంరాత్రి ఎస్ఐరామ్మోహన్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.లక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

చందుర్తి: మండలం నర్సింగాపూర్‌లో బండి శ్రవణ్ కుమార్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు. మొబైల్ పోలీస్ పార్టీ ఆధ్వర్యంలో 17బీర్లు పట్టుకున్నాట్లు పేర్కొన్నారు. మద్యం విలువ రూ.4000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల నిరసన

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో సుమారు 63శాతం బీసీలు ఉన్నా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. బీసీలకు42శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఈ బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యలో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


న్యూఢిల్లీ జంతర్మంతర్‌లో నిరసన తెలుపుతున్న తెలంగాణ బీసీ నాయకులు

- గ్రామ ఓటర్లనే నియమించుకోవాలి
- వార్డుల్లో వార్డు ఓటరే ఉండాలి
- దొంగ ఓట్లను గుర్తించేది స్థానికులే..



పోలింగ్ ఏజెంట్లే కీలకం

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంటే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డుకు పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలి. సదరు ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే కావడంతో సర్పంచ్‌గా పోటీ చేసే ప్రతి అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి కీలకమైన వ్యక్తిని ఏజెంట్‌గా నియమించుకుంటేనే వారి గెలుపు సాధ్యమవుతుంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే వ్యక్తులు ఏ వార్డు నుంచైనా వార్డు మెంబర్ అయితే ఏ వార్డు నుంచి పోటీ చేస్తున్నారో అదే వార్డుకు సంబంధించిన ఓటరును పోలింగ్ ఏజెంట్‌గా నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఏదైనా కారణాల వల్ల ఇతరులను నియమించుకోవాల్సి వస్తే ముందే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాత పూర్వకంగా తెలియజేయాలి. దానిని పరిశీలించి అనుమతి ఇస్తే తప్ప ఇతరులను నియమించుకునేందుకు వీలు లేదు.

● ఏజెంట్ల వివరాలు రిటర్నింగ్ అధికారికి పంపాలి...

సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి స్క్రూటినీ పూర్తి కాగానే ఏజెంట్‌గా నియమించుకునే వ్యక్తి అంగీకార పత్రాన్ని రాత పూర్వకంగా డూప్లికేట్ కాపీతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించాలి. పరిశీలన అనంతరం రిటర్నింగ్ అధికారి నియామక పత్రంపై ఆమోదం తెలుపుతూ సంతకం చేసి ఒక కాపీని ఏజెంట్‌కు అందజేస్తారు.

● కౌంటింగ్ ఏజెంట్ల నియామకం

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో మొదట వార్డుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించి కౌంటింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్ ఏజెంట్ గా వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగి, పలు రాజకీయ పదవులు చేసిన వారు అనర్హులు. వీరిని తప్ప ఎవరినైనా ఏజెంట్లుగా నియమించుకోవచ్చు.

● ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే...

ప్రతి వార్డులో ఆ వార్డుకు సంబంధించిన ఓటరు వచ్చినప్పుడు ఎన్నికల సిబ్బంది ముందుగా క్రమ సంఖ్యతో పాటు అతని పేరు సరి చూసుకున్న తరువాతనే ఓటరుకు వేలుపై ఇంక్ పెట్టి బ్యాలెట్ పేపర్ అందజేస్తారు. ఓటరుకు బ్యాలెట్ పేపర్ అందించిన తర్వాత ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేసినా ఎన్నికల అధికారి దానిని పరిగణలోకి తీసుకోరు. ఎవరైనా ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తే ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిపిన తర్వాతే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

నోడల్ అధికారికి తీవ్ర గాయాలు


గాయపడిన నోడల్ అధికారి వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద జడ్పీ సీఈవో, ఎన్నికల నోడల్ అధికారి వినోద్‌కుమార్ కింద పడగా తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల అబ్జర్వర్ రవికుమార్‌తోకలిసి వినోద్‌కుమార్ తిరిగి వెళుతుండగా సిమెంట్ దిబ్బకు తట్టుకొని కిందపడ్డాడు. దీంతో తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడేఉన్న వైద్యసిబ్బంది ప్రాథమికచికిత్స అనంతరం మెరుగైనచికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నోడల్ అధికారి వినోద్ కుమార్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్‌వాల్ పరామర్శించి చికిత్స చేస్తున్న వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీంతో వినోద్‌కుమార్ స్థానంలో వెంటనే వేములవాడ మండల నోడల్ అధికారిగా శ్రీనివాసరావును నియమించారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

పాలకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాములు అనేవ్యక్తి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ మంగమ్మ బుధవారం తెలిపారు. గతంలో పాలకుర్తి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్‌చేయగా, నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు జరిమానా విధించామన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఆలయంలో దేవతా ప్రతిమలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామశివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో దేవతల ప్రతిమలు బుధవారం దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. స్వామివారి చిత్రపటాలతోపాటు పీటలు పూర్తిగా కాలిపోయాయని పేర్కొన్నారు. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దేవతలప్రతిమలు దగ్ధంపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పోలీసులు వివరించారు.

గుడిసె దగ్ధం

● రూ.20 వేల ఆస్తి నష్టం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ఒడ్డెర కాలనీలో బత్తుల దేవవ్వకు చెందిన గుడిసె బుధవారం దగ్ధమైంది. గుడిసె సమీపంలోని పొలంలో ఓ రైతు కొయ్యకాళ్లకు నిప్పు పెడుతున్న క్రమంలో మంటలు వ్యాపించాయి. గుడిసెలోని దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. బత్తుల దేవవ్వ కుటుంబ సభ్యులు మరో గుడిసెలో ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పినట్లయింది. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు దేవవ్వ పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్, నాగర్‌కర్నూలు జిల్లా మామిళ్లపల్లెకు చెందిన అతినారపు అలివేలు(38)ల మధ్య ఉన్న వివాహేతర సంబంధమే ఆమె హత్యకు దారి తీసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లతో కలిసి హత్యకేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు మండలి నరేష్ ఉపాధి కోసం తన భార్య పిల్లలతో కలిసి హైదారాబాద్ సుచిత్రలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉండేవాడు. సుమారు 5సంవత్సరాల క్రితం నిందితునికి మృతురాలు అతినారపు అలివేలుతో పరిచయం ఏర్పడింది. మృతురాలుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబంలోని గొడవలతో ఆమె తన భర్తతో విడాకులు తీసుకున్నది. ఈ క్రమంలో ఆమెకు నరేష్‌తో ఏప్పడిన పరిచయం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధం నిందితుడి భార్యకు తెలియగా, ఆమె సుమారు 2 సంవత్సరాల క్రితం తన తల్లి తండ్రుల వద్దకు వెళ్లి పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నది. ఈ క్రమంలో మృతురాలు తన భార్యపిల్లలను వదిలి తనను పెళ్లి చేసుకోవాలని నిందితున్ని తరుచూ ఇబ్బంది పెడుతుండేది. అంతే కాకుండా నిందితుని స్వగ్రామం స్తంభంపల్లికి వెళ్లి గొడవ చేస్తుండేది. కాగా 2024లో వీరిద్దరికీ డబ్బులు అవసరం ఉండగా మంచిర్యాలలో కూస లక్ష్మి అనే మహిళను ఇద్దరు కలిసి హత్యచేసి ఆమెవద్ద ఉన్న బంగారం దొంగిలించారు. హత్య కేసును చేధించిన మంచిర్యాల పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు. ఇద్దరు జైలు నుంచి మూడు నెలలక్రితం విడుదల అయ్యారు. మృతురాలు అలివేలు మంగళవారం స్తంభంపల్లి గ్రామంలోని నరేష్ ఇంటికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే నాచావుకు మీరే కారణమని ఉత్తరం రాసి ఇంటి ముందు ఉన్న బావిలో దూకి చచ్చిపోతానని బెదిరించింది. దానితో నరేష్ ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని అక్కడే ఉన్న రోకలిబండతో అలివేలు తలపై బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఎస్సై ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి కేసును దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మండలి నరేష్‌ను ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

ప్రజా బాంధవుడిని కోల్పోయాం

● మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
● సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సమద్ నవాబ్ అంత్యక్రియలు


ఆవాల సరోజకు నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదముస్లింల పక్షపాతిని, ప్రజాబాంధవుడిని సమాజం కోల్పోయిందని మంత్రి శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రెటరీ అబ్దుల్ సమద్ నవాబ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటన్నారు. పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. కాంగ్రెస్ సమద్ నవాబ్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఆవాల సరోజ కుటుంబాన్ని పరామర్శించారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లి ప్రమాదవశాత్తు మూడు నెలల క్రితం మృతి చెందిన గుర్రం సురేష్ మృతదేహం బుధవారం నేరెళ్ల స్వగ్రామానికి చేరుకుంది. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన గుర్రం సురేష్ జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లాడు. ఇరాక్‌లోని హేవ కంపెనీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు సెప్టెంబరు 3న మృతిచెందాడు. మూడునెలల తరువాత మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా శవపేటికపై పడి కుటుంబసభ్యులు బోరున విలపించారు. దహన సంస్కారాలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతురులు, తల్లి ఉంది. మృతదేహం రావటానికి ఎంబసీ అధికారులు, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ అధికారులు, ఎన్నారై అధికారులు సహకరించారు. ఇందుకోసం సహకారం అందించిన మంత్రి, అధికారులకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ తెలిపారు.

అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల స్వైర విహారం

● గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడి


కుక్కకాటుకు గురైన చిన్నారి

జ్యోతినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో ఈదునూరి బానేష్, ఈదునూరి భాగ్య, గోషిక దుర్గమ్మ, పెగడపల్లి రుద్ర, నర్మదకు గాయాలయ్యాయి. కొంతకాలంగా అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, మున్సిపల్‌అధికారులకు ఎన్నిమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు. తక్షణమే మున్సిపల్ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నపూర కాలనీలో పిచ్చికుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాలని వారు రామగుండం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను కోరారు.

ప్రమాదకరంగా డివైడర్లు..

● తరచూ రోడ్డు ప్రమాదాలు ● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్


కోరుట్ల బస్టాండులో ప్రమాదకరంగా ఉన్న డివైడర్



రోడ్డు ఇరుకుగా ఉండడంతో డిసెంబరు 2న డివైడర్‌ను ఢీకొట్టిన కారు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపం నుంచి తెలంగాణ చౌక్ వరకు ఉన్న డివైడర్‌లు ప్రమాదకరంగా మారాయి. చందుర్తి, మల్లారం నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాదారులకు స్వాగతం పలికే కమాన్ సమీపంలో డివైడర్ ప్రారంభం అవుతుంది. డివైడర్ ప్రారంభంలో ఎలాంటి సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో డివైడర్ ఉందని వాహనదారులకు కనిపించకపోవడంతో డివైడర్‌ను ఢీకొంటున్నారు. వాహనదారులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు వెంటనే చీకట్లో వాహనదారులకు కనిపించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు, స్థానిక వ్యాపారులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం రోడ్డు సంఘటనలు..

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపంలోని డివైడర్ ప్రారంభం వద్ద ప్రతి నిత్యం వాహనాలు డివైడర్‌ను ఢీకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు డివైడర్ కనిపించకపోవడంతో వేగంగా డివైడర్‌ను ఢీకొడుతున్నారని దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. రోడ్డుపైన ఏర్పాటు చేసిన డివైడర్‌లు సైతం పక్కకు జరిగి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

- అక్కనపల్లి వివేక్‌రెడ్డి, వేములవాడ



కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు ప్రమాదకరంగా డివైడర్‌లు ఉన్నాయి. రోజు ఒక సంఘటన జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు వాహనదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలి.

పార్వతీపురంలో నాగుపాము కలకలం


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ జగదీశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న వసతిగదులైన పార్వతీపురం వద్ద బుధవారం భారీ నాగుపాము ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. కొంతకాలంగా వినియోగంలో లేని వసతి గదిని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అందులో వస్తువులను తొలగిస్తుండగా ఐదు అడుగుల నాగుపాము ప్రత్యక్షమైంది. వెంటనే ఆలయ పర్యవేక్షకులు శ్రీకాంత్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్లశివ స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించడంతో ఆయన చేరుకొని నాగుపామును పట్టుకొని బయట వదిలేశాడు.

చివరి మజిలీకి తప్పని తిప్పలు

● బ్యాక్ వాటర్‌లోనే అంత్యక్రియలు


రుద్రవరంలో నీటిలోనే అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో చివరి మజిలీకి సైతం తిప్పలు తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన ముదం నర్సయ్య అనే వృద్ధుడు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన శ్మశాన వాటికలోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ చేరడంతో అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సయ్య మృతదేహంతో నీటిలోనే అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఏపీపీ రాత పరీక్షను వాయిదా వేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాతపరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది ముక్కెరరాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల14న ఏపీపీ రాత పరీక్షరోజున రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఉన్నాయని, అదేరోజు ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట, తిరిగి మధ్యాహ్న 2:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఏపీపీ రాత పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. ఏపీపీ రాత పరీక్షకేవలం హైదరాబాద్‌లోనే నిర్వహిస్తుండడంతో గ్రామీణప్రాంత న్యాయవాదులు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నారన్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించినహక్కు అని,సద్వినియోగం చేసుకునేందుకు బోర్డుపునరాలోచన చేయాలని కోరారు.

బైండోవర్

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీఎన్నికల నేపథ్యంలో మండలంలోని 24మంది బెల్ట్‌దుకాణాల నిర్వాహకులను బైండోవర్‌చేశారు. మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొంటూ ఎక్సైజ్ అధికారులు వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.



ఓటుకే ప్రాధాన్యం

- నిబంధనలు పాటిస్తేనే మేలు
- ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు

జగిత్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుం టే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరు తో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● నిబంధనలు పాటించాల్సిందే..

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్ని కల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు భద్రత సిబ్బందికి సహకరించాలి. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రామాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువపత్రాలలో ఏదైనాఒకటి తీసుకెళ్తే ఓటువేసేందుకు అవకాశం ఉంది.

● సందేహాలు ఉంటే పీఓకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ)కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్య వేక్షించి రెండు గంటలకొకసారి నమోదైన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలి



ఎస్‌యూలో ఎత్నిక్ డేలో పాల్గొన్న ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని సంస్కృతీ సంప్రదాయాలే మూల స్తంభాలని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కూమార్ అన్నారు. బుధవారం యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో ఎత్నిక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వాణిజ్య, వ్యాపార కళాశాల ఏటా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. జాతి గౌరవాన్ని పెంపొందించే ఆచారాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వీసీ ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400 పలికింది. బుధవారం మార్కెట్‌యార్డుకు 62మంది 446క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.6900 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాజు పర్యవేక్షించారు.

రహదారి ఆక్రమణపై రైతుల రాస్తారోకో



గ్రామస్థులతో చర్చిస్తున్న పోలీసులు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లుల్ల రోడ్డు నుంచి వ్యవసాయ పనులు, మల్లెతోటలకు వెళ్లే రహదారి ఆక్రమించారని పేర్కొంటూ బుధవారం రైతులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు అక్కడికి వచ్చి ఎన్నికల అనంతరం దీనిపై చర్చించుకుందామని వారిని సముదాయించి హామీ ఇవ్వడంతో రైతు నిరసన విరమించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మల్లెతోటకు వ్యవసాయ పనులకు దారి ఉండేదని, దానిని కబ్జా చేయడంతో సుమారుగా 300మంది రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల అక్రమంగా లింకు రోడ్డు కబ్జాకు గురైందని, ప్రవాహం లేని ఎస్సారెస్పీ డీ32 ను రోడ్డుగా అభివృద్ధిచేయాలని, సైనో1094లో గల మేఘనా వెంచర్‌లోని 40 ఫీట్ల రోడ్డు నుంచి మల్లెతోట వరకు రోడ్డు అభివృద్ధి చేసి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంగు గంగాధర్, మాజీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్, అరిసెల రమేష్, బొడ్ల సాగర్, రామకృష్ణ, ఆకుల ప్రవీణ్, రవి, అంజయ్య గాజా రాజారెడ్డి, రాహుల్, సంగు ప్రతిప్, అంజాగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులో భాగంగా కాంట్రాక్టరు రోడ్డుకు ఇరువైపుల ఎక్సకవేటర్ సహాయంతో మట్టిని తొలగించారు. దీంతో రోడ్డు పక్క నుంచి ఇండ్లల్లోకి వెళ్లే మిషన్ భగీరథ పైపులు తెగిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై సువరుగా 15 రోజులు అవుతున్న పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు, వ్యాపారులకు మిషన్ భగీరథ నీరు అందక, రోడ్డు తవ్వి వదిలేయడంతో ఇంట్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల బాలికల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుచిత్ర

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 17,19విభాగాల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుచిత్ర తెలిపారు. ఫుట్ బాల్ బీచ్ వాలీబాల్‌లో 10వతరగతి విద్యార్థి అమీనా, అండర్-19 విభాగంలో కో-కో పోటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్ఫూర్తి, అసోసియేషన్ కబడ్డీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువు తున్న షబానా ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆమె తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుచిత్ర, పీడీ శ్రీవిద్య, పీఈటీ రమాదేవితో పాటు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయపల్లి గ్రామస్థులకు నీటి తిప్పలు

● మిషన్ భగీరథ నీరు రాక ప్రజల కష్టాలు



వాటర్ ట్యాంకర్‌తో నీటిని నింపుకుంటున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు రాక నాగాయపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగాయపల్లి గ్రామంలో కొన్నిరోజులుగా మిషన్ భగీరథనీరు అందక ప్రజలు నీటితిప్పలు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి, ఇంటి అవసరాలకు వాటర్ ట్యాంకుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పంటపొలాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటిని తెచ్చుకొని అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు అందకుండా నీటికి కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికి అధికారులు స్పందించడం లేదని, గ్రామంలో ఉన్న 3 బోరుబావులు నిరుపయోగంగా ఉన్నాయని వాటని సైతం పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యవిధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలి



సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీజీఎంఈయూ సభ్యులు

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలని, దాని స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌సర్వీసెస్‌ను ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం యూనియన్ నాయకులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని ఉద్యోగులు సామూహికంగా సంతకాల సేకరణ చేపట్టి ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ 1986లో ఏర్పాటైన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించకపోవడం, వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) వినతులు సమర్పించే అవకాశం లేకపోవడం, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సులోచన, సునీత, శోభ, జమున, జ్యోతి, స్నేహ, సుజాత, మమత, శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తున్న ఏసీటీవోలకు డీసీటీవోగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. బుధవారం తెలంగాణ వాణిజ్యపన్నులశాఖ రాష్ట్రకమిషనర్ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖాళీగాఉన్న డీసీటీవోపోస్టుల్లో ఏసీటీవోలకు ప్రమోషన్లు ఇస్తే రాష్ట్రప్రభుత్వ ఖజానాకు ప్రొఫెషనల్‌టాక్స్ రావడానికి అవకాశం ఉందన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డును అందుకుంటున్న పున్నం చందర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఉత్తమ సేవలకు అవార్డులు వచ్చాయి. బుధవారం హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టం ఏపీజె అబ్దుల్‌కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గత 15సంవత్సరాలుగా సైకాలజిస్ట్‌గా ప్రజలకు, కార్మికులకు విశేషసేవలు అందిస్తున్న సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్ బెస్ట్‌సర్వీస్‌అండ్ సైకాలజిస్ట్ అవార్డుకు ఎంపికయ్యాడు. అదేవిధంగా హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తున్న అల్వాల ఈశ్వర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా వైస్ చైర్మన్ గడ్డం దివాకర్ ఉత్తమ సామాజిక సేవ అవార్డులకు ఎంపికయ్యారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హనుమాగౌడ్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కన్వీనర్ గాజుల వేణుకుమార్, రాష్ట్ర ఉమెన్ వింగ్ డైరెక్టర్ గజ్జెల కరుణ అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

'నవోదయ' ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఈ నెల 13న నిర్వహించే నవోదయ 6వ తరగతి ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 34పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్న సీఎం: చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు బాటలు వేసే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచిపోతారని, విద్య, వైద్యం ఉపాధి అవకాశాలపై విజన్ ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారంవిలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరగాలంటే వనరులన్నింటినీ ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణలో మొదటి నుంచి భూ సమస్య ఉందన్నారు. రైజింగ్ తెలంగాణ 2047గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విషయాలను పొందుపరిచారని, జల్ జంగల్ జమీన్ కొమరంభీం ప్రస్తావన చేయడం, భూమి కోసం భుక్తి కోసం విముక్తికోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది అమరత్వం పొందినట్లు చెప్పారన్నారు. ఏ ముఖ్య మంత్రి కూడా ఇలా మాట్లాడ లేదని, సామాజిక అంశాలపై లోతుగా అధ్యయనం చేశారని అన్నారు. విద్య వైద్యంపై సంపూర్ణ అవగాహన కలిగి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గ్లోబల్ సమ్మిట్ ఉండాలని ముందు చూపుతో వ్యవహరించిన సీఎంను అభినందిస్తున్నామని అన్నారు. స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదని, దాదాపుగా 4వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఎన్నికల్లో సీపీఐ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్,గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న బావి

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి గ్రామాలమధ్య రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారిపై మూల మలుపు ఉండడమే కాకుండా రోడ్డును ఆనుకొని వ్యవసాయ బావి ఉంది. ఈ రహదారి వెంట వేగురుపల్లి, లక్ష్మీపూర్, వెల్ది, లింగాపూర్, జగ్గయ్యపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో కరీంనగర్‌కు వెళ్తారు. వందలాది ఇసుక ట్రాక్టర్లు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నడుస్తూనే ఉంటాయి. బావి వద్ద పెద్ద వాహనాలు ఎదురుగా వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించడానికి సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమ్మక్క భక్తులకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయానికి వచ్చే సమ్మక్క, సారలక్క జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ భీమన్న ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆలయ అధికారులతో కలిసి విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో రద్దీ పెరిగినందున అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఉచిత దర్శనం, కోడెల క్యూలైన్, కళ్యాణ కట్ట, విఐపి రోడ్డు, తదితర క్యూలైన్‌లను పరిశీలించారు. ప్రధానంగా తాగునీటి సదుపాయం, సైన్‌బోర్డులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్ర శాలలు, స్నానాల గదులు, లైటింగ్ సదుపాయాలు, ఫ్యాన్లు, సీసీకెమెరాలు, డిజైన్స్, సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమ్మక్క జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు.

పల్లెలకు తరలిన పోలింగ్ సిబ్బంది

మంథని/మంథనిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో గురువారం జరిగే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయటానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాటు పూర్తి చేసింది. స్థానిక ప్రభుత జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బుధవారం మధ్యాహ్నం పోలింగ్ సిబ్బంది సామగ్రితో ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు తరలి వెళ్ళారు. ఎన్నికల నిర్వహణ కోసం 324 మంది పోలింగ్ ఆఫీసర్లు, 250 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, 600 మంది సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మండలాన్ని 4 జోన్లుగా, 11 రూట్లుగా విభజించారు. 34 మందిని గ్రామపంచాయతీ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది పోలింగ్ బాక్సులతో మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సర్పంచ్ ఎన్నికల కోసం తరలివెళ్లారు. ఇందులో 24 మంది రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ ఆఫీసర్లు 226, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 550, జోనల్ ఆఫీసర్లు 5, రూట్ ఆఫీసర్లు 8, పోలీస్ సిబ్బంది 150, అలాగే రిజర్వుగా 77 మంది పోలింగ్ సిబ్బంది పోలింగ్ విధి నిర్వహణకు తరలి వెళ్లారని ఎంపీడీఓ రాంమోహన్‌చారి తెలిపారు.


కాల్వశ్రీరాంపూర్ మండలం డిస్ట్రిబ్యూటర్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది

రామగిరి, (ఆంధ్రజ్యోతి): తొలి విడత జరిగే పంచాయతీ ఎన్నికలకు సర్వంసిద్ధం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను ఏర్పాటుచేశారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి బ్యాలెట్ పేపర్స్, బాక్స్ పోలీస్ పహారాలో గ్రామాలకు తరలించారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్ కలెక్టర్ శ్రీహర్ష, ఎంపీడీవో శైలాజరాణి, తహసీల్దార్‌సుమన్‌లు పర్యవేక్షించారు.

సచ్‌దేవా పాఠశాలలో వార్షికోత్సవ క్రీడలు


గెలిచిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేసిన అధికారులు

జ్యోతినగర్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ టీఎస్‌లోని సచ్‌దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుధవారం క్రీడా వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ ఇతర క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. అలాగే విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు చదువు తోపాటు క్రీడల్లో ఆసక్తి ఉండాలని ఈడీ అన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ధృడత్వం పెరుగుతుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం అలవర్చుకోవాలని సూచించారు. స్వచ్ దేవా విద్యాసంస్థల చైర్మన్ సౌరవ్ సచ్‌దేవా, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్, అధికారులు ఏకే సింగ్, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులకు చోటు

జ్యోతినగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెదక్‌లో ఈ నెల 7న జరిగిన సీఐటీయూ మహాసభలలో జిల్లాకు చెందిన పలువురు నాయకులకు రాష్ట్ర కౌన్సిల్‌లో స్థానం కల్పించారు. పెద్దపల్లి జిల్లా నుంచి ముత్యం రావు, రాజిరెడ్డి, రామాచారి, జ్యోతి, వేల్పుల కుమారస్వామి, సారయ్యలను రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీకి ఎంపికైన నాయకులకు సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, గీట్ల లక్ష్మారెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కౌశిక్ హరి జన్మదినం

పాలకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ అల్ట్రాటెక్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక్ హరి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు స్వీట్లను పంచుకున్నారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్మిక సంఘం నాయకులు బత్తిని సతీష్ గౌడ్, బూర్ల శ్రీనివాస్, కొమ్ము శ్రీనివాస్, తమ్మడవేణ అంజయ్య, గూడెపు రాజయ్య, పూసాల ప్రసాద్, ములకనూరు శ్రీధర్ తదితరులతో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పైసా వాలా సినిమా పోస్టర్ ఆవిష్కరణ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పైసా వాలా సినిమా పోస్టర్‌ను బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికుడి కుమారుడు అద్విక్ హీరోగా నటించాడు. అతని తండ్రి ఉపేంద్రచారి సింగరేణి వర్క్‌షాప్‌లో మౌల్డర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరో అద్విక్, డైరెక్టర్ నవీన్ తేజస్‌లు మాట్లాడారు. స్నేహితుల సహకారంతో తక్కువ బడ్జెట్‌లో ఈ సినిమాను రూపొందించామన్నారు. పెద్ద సినిమాలకు తీసిపోకుండా పైసా వాలా సినిమాను చిత్రీకరించామన్నారు. 10రూపాయల నోటు చుట్టూ సినిమా కథ తిరుగుతుందని, సినిమాను ప్రజలు ఆదరించాలని కోరారు. డైరెక్టర్ నవీన్ తేజస్, గడ్డం శ్యాంకుమార్, పూదరి కుమార్, మ్యాజిక్ రాజా, జీవన్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వారిని కాంగ్రెస్ సర్పంచ్‌లుగా ఏకగ్రీవం చేయడం సిగ్గుచేటు

● విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మంథని నియోజకవర్గంలో పోటీలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు పలువురిని అధికార కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొని ఏకగ్రీవంగా సర్పంచ్‌లను చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. బుధవారం పుట్ట మధు విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మొఖం చెల్లకనే ఓటమి భయంతో తమ పార్టీకి చెందిని వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీ చెందిన వారిని విత్‌డ్రా చేయించి సర్పంచ్‌లుగా ఏకగ్రీవం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికి అవకాశం వస్తే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల కోసం సొంత పార్టీ అభ్యర్థులను నమ్మించి గొంతుకోసి విత్‌డ్రాలు చేయించారన్నారు. మంథని మండలంలో ఖైదుపల్లిలో పంతంగి లక్ష్మణ్, రామగిరి మండలంలో చందనాపూర్‌లో కొండ శ్రీను, మహదేవపూర్ మండలంలో జువ్వాజి తిరుపతిలను ఇదే విధంగా ఏకగ్రీవం చేయించారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మోసం చేసే విధానాలను గమనించి జాగ్రత్త పడాలన్నారు. గతంలో తమ పార్టీ నుంచి సర్పంచ్ ఎన్నికల్లో ఒక్కరే అభ్యర్థి ఉంటాడని బహిరంగంగా ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబు ఇప్పుడు ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురు బరిలో ఉన్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి వాటిన అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, పువ్వాల తిరుపతి, గొబ్బూరి వంశీ, కాయితీ సమ్మయ్య, మాచీడి సత్యనారాయణగౌడ్, ఇర్ఫాన్, నాగరాజులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుట్ట మధు

కందునూరిపల్లి ఎనిమిది వార్డులు ఏకగ్రీవం

సుల్తానాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కందునూరుపల్లి గ్రామపంచాయతీలో ఉన్న ఎనిమిది వార్డు స్థానాలకుగాను అన్ని స్థానాలలో ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నిక య్యారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఆయా వార్డుల్లో ఒక్కోక్క అభ్యర్థి నామినేషన్ మాత్రమే ఉండడంతో ఎనిమిది వార్డు స్థానాలలో అభ్యర్థులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ పదవి కోసం ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతు న్నారు. ఇక్కడ బీసీ మహిళకు రిజర్వ్ చేశారు.

మంచరామి, కందునూరుపల్లిలో తోడి కోడళ్ల పోటీ

సుల్తానాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని మంచరామి గ్రామ పంచాయతీ ఎన్నికలలో తోడి కోడళ్ల సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. గ్రామంలో రిటైర్డు ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి సతీమణి లక్ష్మీ సర్పంచ్‌గా పోటీ చేస్తుండగా, గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పు అనిత సంపత్‌లు బరిలో ఉన్నారు. రిటైర్డు ఐపీఎస్ తిరుపతి, ఉప్పు సంపత్‌లు ఇద్దరు చిన్నాన్న పెద్ద నాన్న కొడుకులు. తిరుపతి, సంపత్ తండ్రులు సొంత అన్నదమ్ములు. ఉప్పు లక్ష్మీ, ఉప్పు అనితలు బీసీ మహిళలకు రిజర్వ్ కాగా మంచరామి సర్పంచ్ గా పోటీ చేస్తున్నారు.

● కందునూరుపల్లిలో పన్నాల తిరుపతి, పన్నాల సతీష్‌లు ఇద్దరూ చిన్నాన్న పెద్దనాన్న కొడుకులు. వీరి తండ్రులు సొంత అన్నదమ్ములు. బీసీ మహిళలకు కందునూరుపల్లి కేటాయించారు. అన్నదమ్ముల భార్యలు పన్నాల స్వరూప, పన్నాల శైలజలు తోడి కోడళ్ళు సర్పంచ్ పదవికి పోటీపడుతున్నారు. గత ఎన్నికలలో పన్నాల స్వరూప తిరుపతి సర్పంచ్‌గా పనిచేశారు. పన్నాల శైలజ మొదటిసారి ఎన్నికల బరిలో నిలిచారు.

మీ రాజకీయ పబ్బంతో మమ్మల్ని అభాసుపాలు చేయొద్దు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడిగా చెప్పుకుంటున్న హరీష్‌రెడ్డి ముఖమే తమకు తెలియదని, అతడిని ఎన్నడూ చూడలేదని గోదావరిఖని గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం నాయకులు మేరుగు గట్టయ్య, మొగిలి కడియాల జంపయ్య, మేరుగు రాజేష్‌లు పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడో అమెరికా నుంచి వచ్చి ఇక్కడి పరిస్థితులు తెలియకుండా మా గురించి, మా వ్యాపారం గురించి తెలియకుండా హరీష్‌రెడ్డి మమ్మల్ని అబాసుపాలు చేసే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. 50ఏళ్లుగా తమ తాతముత్తాతల నుంచి ఇక్కడ మేకలు, గొర్రెలను పెంచుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నామని, ఎప్పుడు కూడా మమ్మల్ని ఎవరూ డబ్బులు అడిగిన పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యేగా రాజ్ ఠాకూర్ ఎన్నికైన తరువాత మా సమస్యలపై సానుకూలంగా స్పందించారని, మార్కెట్‌కు ఇరువైపులా రోడ్లు నిర్మించారన్నారు. తమ సంఘానికి ఎళ్లవేళలా అండగా ఉంటున్నాడన్నారు. మాకు, ఎమ్మెల్యేకు మధ్య దూరం పెంచేందుకు హరీష్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు మమ్మల్ని మధ్యలోకి లాగి అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్నాడని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మమ్మల్ని అడ్డంపెట్టి ఎమ్మెల్యేపై బురదజల్లే యత్నాలను మానుకోవాలని, రాజకీయంగా ఎమ్మెల్యేను ఎదుర్కోవాలంటే అతన్నే నేరుగా ఎదుర్కోవాలని, మమ్మల్ని మధ్యలో లాగవద్దన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు తిరుపతి, ఎల్లయ్య, మొగిలి మొండేల్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వృక్షాలు



సుల్తానాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా వృక్షాలు, పచ్చదనం వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆ దారిన పోయే వారు ఆ ప్రాంతంలో సెల్ఫీలు దిగుతున్నారు. సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల నుంచి గట్టేపల్లి వరకు ఉన్న రోడ్డులో రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు ఉన్నాయి. అవి ఒక వైపు చెట్ల కొమ్మల చివరలు మరో వైపు ఉన్న చెట్ల కొమ్మలు చివరలు కలసి పోయి రోడ్డుకు పచ్చని పందిరి మాదిరిలా తయారయ్యాయి. అలాగే తొగర్రాయి నుంచి మంచరామి గ్రామం రోడ్డులో ఇలానే ఉన్నాయి. రామునిపల్లి నుంచి అల్లీపూర్ రోడ్డుకు ఇరువైపులా చెట్లు ప్రకృతీ అందాలతో చూడముచ్చట గా చూపరులను ఆకర్షిస్తున్నాయి.

టీబీ ఛాంపియన్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వాణిశ్రీ

కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీ ఛాంపియన్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వాణిశ్రీ ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్మూలనలో టీబీ చాంపియన్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. క్షయవ్యాధి గురించి ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, మందులను సక్రమంగా వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు 12 ఆమ్ (ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్) సెంటర్ల నుండి, అలాగే సింగిల్ ఆమ్ల నుండి కూడా టీబీ చరిత్ర కలిగిన 30మందిని ఎంపిక చేసి టీబీ చాంపియన్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ స్టేట్ లీడ్ మిస్టర్ పురుషోత్తం, జిల్లా లీడ్ దేవోజు శ్రీనివాస్, టీబీ రిసోర్స్ పర్సన్ దాసరి అంజలి పాల్గొన్నారు.

జిల్లాలో టీబీ కేసులు తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అందుబాటులో ఉన్న సేవలు, పరీక్షలు, చికిత్స విధానాలను వారు వివరించారు. గతంలో టీబీ వ్యాధి వచ్చి పూర్తిగా కోలుకున్నవారిని టీబీ చాంపియన్లుగా ప్రకటించి, వారి అనుభవాలను ప్రజల్లో పంచుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఆయా ఆమ్ సెంటర్ల పరిధిలో గ్రామసభలు, మహిళా సంఘాల సమావేశాలు, పాఠశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువగా చేరే ప్రదేశాల్లో టీబీ చాంపియన్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. టీబీ ఇన్ఫెక్షన్ కేసులు, మరణాలు తగ్గించేందుకు తమ వంతు పాత్రను నిబద్ధతతో కొనసాగిస్తామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరాములు, డీటీఓ డాక్టర్ కేవీ సుధాకర్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ లక్ష్మీ భవాని, డాక్టర్ స్నేహలత, ఎన్‌టీఈపీ సిబ్బంది గోపి కృష్ణ, హెచ్‌ఇఓ, సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజ ర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కోడూరి రమేష్

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ కోడూరి రమేష్ మాట్లాడారు. విద్యార్థులు, యువత మానవ హక్కులు, చట్టాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రాథమిక హక్కులను పాఠశాల దశలోనే తెలియజేయాలని పేర్కొన్నారు. ఎదుటి వారి గౌరవానికి భంగం కల్గకుండా హక్కుల పరిరక్షణ అనేది ఉండాలన్నారు. ప్రస్తుత యువత వినియోగదారుల చట్టం, హక్కు వంటివి తెలుసుకోవాలని సూచించారు. 1948 డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటించారని, ఫాదర్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌గా ఫ్రెంచ్ జర్నలిస్టు రేనేకాసినో నిలిచారని, మానవ హక్కుల పరిరక్షణకు చేసిన కృషికి ఆయనకు 1968లో నోబుల్ బహుమతి వచ్చినట్లు రమేష్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారి శంకర్, అధ్యాపక బృందం అనురాధ, విజయ, రఘు, లక్ష్మి, ఓదేలు పాల్గొన్నారు.

పాలకుర్తి,అంతర్గాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్ కుమార్ అన్నారు. రామగుండంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ ఆదేశాల మేరకు జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి మాదాసి చారేంద్ర సూచనల మేరకు మానవ హక్కుల గురించి చర్చించారు. బోంకూరి కైలాసం, చంద్రకాంత్, జాగటి శాంతమ్మ, లక్ష్మి, అబ్దుల్ సలీం, సిరికొండ కోటి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొండల రాజేందర్ కుమార్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడిటోరి యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ మాట్లాడుతూ.. ప్రతి మనిషికి రాజ్యాంగం హక్కులను ప్రసాదించిందని, వాటిని కాపాడుకోవడానికి చట్టాలు ఉన్నాయని తెలిపారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టపరమైన సమస్యలపై 15100కు ఫోన్ చేసి న్యాయపరమైన సలహా పొందవచ్చన్నారు.

గణేశ్‌నగర్: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మానవ హక్కులు, న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సామాజిక సవాళ్ళు, చట్టపరమైన అంశాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, చంద్రప్రకాష్ రెడ్డి, కిరణ్ కుమార్, పానెల్ న్యాయవాది మాన్వాడ రామాంజనేయులు అవగాహన కల్పించారు.

కార్మికుల సమస్యలపై కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో పనిచేసే శానిటేషన్‌లో మొకద్దంలను కొనసాగించాలని ఏఐటీయూసీ నాయకులు బుధవారం కమిషనర్ జే అరుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. నగర సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటేషన్ విభాగంలో పనిచేసే పది మందిని నాలుగు డివిజన్‌లకు ఒక జోన్‌గా ఏర్పాటు చేసి జోనుకు ఒక మొకద్దాంను నియమించారన్నారు. పదిమంది 8సంవత్సరాల పైగా పని చేస్తున్న వారిని ఇతర పనులకు వాడుకోవడం మానుకోవాలని, తక్షణమే వారి స్థానాలకు వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ప్రాంతంలోని నర్సరీలో పనిచేస్తున్న కార్మికులను శానిటేషన్ విభాగానికి పంపించడం సరైన విధానం కాదని, వారు గత 20సంవత్సరాలుగా నర్సరీలో పనిచేస్తున్నారని, తక్షణమే వారిని నర్సరీలో కొనసాగించాలని కమిషనర్‌ను కోరారు. ర్యాగ్ పిక్కర్ కార్మికులను కూడా ఆదుకోవాలని, వారికి అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి రామారావు డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి బుధవారం సంతకాలు సేకరించి అధికారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 1986లో ఏర్పాటు చేసిన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఎంఏ అతీఖ్, ప్రధాన కార్యదర్శి ఎ దేవరాజ్, జగన్, లహరి, రమ, శ్యామల, నర్సయ్య, స్వామి, మతీన్ పాల్గొన్నారు.



రక్షణతో పని చేసి ప్రమాదాలను అరికట్టాలి


సేఫ్టీ క్విజ్‌లో గెలిచిన వారికి బహుమతులు అందజేస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని, రక్షణతో పని చేసి ప్రమాదాలను అరికట్టాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. 56వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం వకీల్‌పల్లె గనిని సేఫ్టీ కమిటీ తనిఖీ చేసింది. కార్పొరేట్ జీఎం ఎన్విరాన్‌మెంట్ సైదులుతో కలసి గని ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జీఎం వెంకటయ్య మాట్లాడారు. కేవలం పనిస్థలాల్లోనే కాకుండా ఇంటి నుంచి బయలుదేరిన మొదలు బయట, రోడ్డు మీద జాగ్రత్త పడాలని సూచించారు. యువ కార్మికులు ప్రమోషన్లు పొందేలా వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని వారు సూచించారు. ఉద్యోగులు తమ రెండేళ్ళ సర్వీస్‌ను వదులుకుని వారసులకు ఉద్యోగాలు పెట్టిస్తున్నారని, గైర్హాజరీ లేకుండా విధులకు హాజరుకావాలన్నారు. అత్యధిక ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగా జరుగుతున్నాయని, విధుల్లో అధికారులు, సీనియర్ల సూచనలు పాటిస్తూ, రక్షణ పరికరాలు అవసరమైన చోట వినియోగిస్తూ తొందరపాటు లేకుండా పని చేస్తే ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించవచ్చని జీఎంలు పేర్కొన్నారు. రక్షణపై ఉద్యోగుల ప్రదర్శన ఆకట్టుకున్నది. సేఫ్టీ క్విజ్‌లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. అధికారులు పీ శ్రీనివాస్, దేశాయి, సముద్రాల శ్రీనివాస్, ఆదినారాయణ, మధుసూదన్, రాముడు, సంతోష్ కుమార్, అరవిందరావు, నెహ్రూ, రవికిరణ్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం


ప్రజాభిప్రాయ సేకరణ పనులను పరిశీలిస్తున్న జీఎం

రామగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జెఎన్‌టియు(మంథని) కళాశాలలో నిర్వహించే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను బుధవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పర్యవేక్షించారు. ప్రజాభిప్రాయ సేకరణ వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు రామ్మోహన్, రాజారెడ్డి, సత్యనారాయణ, రాజేంద్రకుమార్, జనార్ధన్‌రెడ్డి, ఐలయ్య, షబ్బీరుద్దీన్, సునీల్‌ప్రసాద్, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన జీఎం


మానసిక వికలాంగులు తయారు చేస్తున్న వాటిని పరిశీలిస్తున్న జీఎం

గోదావరిఖని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్‌లోని మనో చైతన్య వృత్తి శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ సందర్శించారు. మనో చైతన్య వృత్తి శిక్షణ కేంద్ర నిర్వాహకులు కృష్ణ కుమార్‌ను పలు విషయాల గురించి తెలుసుకున్నారు. కృష్ణ కుమార్ వృత్తి శిక్షణ కేంద్ర నిర్వాహకులు ఇక్కడ నెలకొల్పిన పరిశ్రమలు, విద్యార్థులు తయారు చేస్తున్న వాటి గురించి జీఎంకు వివరించారు. మనో చైతన్య వృత్తి శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ మానసిక దివ్యాంగులతో తయారు చేస్తున్న స్వీట్ బాక్స్, బుక్స్ టీకప్స్, అగరువత్తులు తయారు చేయడం, ఎన్వలప్ కవర్స్, ఫైల్స్, ప్యాడ్స్, పేపర్ బైండింగ్, చాక్‌పీస్‌ల తయారీని జీఎం పరిశీలించారు. మనో చైతన్యకు సింగరేణి పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ మేనేజర్ హన్మంతరావు, మనోచైతన్య బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.